ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 2 అక్టోబరు 2024



## తిరుమలలో పవన్

6

ప్రాయశ్చిత్త దీక్ష విరమణకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అలిపిరి నడకమార్గం గుండా మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. బుధవారం ఉదయం స్వామిని దర్శించుకుని, దీక్ష విరమించనున్నారు.

# సామాన్య భక్తులకే పెద్దపీట

'ప్రస్తుతమున్న ఉన్నతాధికారులందరం శ్రీవారి బ్రహ్మోత్సవాలకు కొత్తే. అయినప్పటికీ గతంలో పనిచేసిన అధికారులు, మీడియా, భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నాం. అన్నిటినీ పరిశీలించి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాం. స్వామి దర్శనం, వసతిలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తాం' అని టీటీడీ ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. ఈనెల 4న శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

- బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మెరుగైన ఏర్పాట్లు
- 'ఆంధ్రజ్యోతి'తో టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమలలో ఈనెల 4 నుంచి 12వ తేది వరకు జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. మూలవిరాట్టు దర్శనంతో పాటు వాహనసేవ దర్శనం సంతృప్తికరంగా జరిగేలా చర్యలు తీసుకున్నాం. ఆలయంలోని క్యూలైన్లతో పాటు గ్యాలరీల్లోని భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టడానికి అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. గతంలో గరుడవాహనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తాయి? మరుగుదొడ్లు, తాగునీరు అందించడంలో ఎలాంటి సమస్యలు వచ్చాయి? గ్యాలరీల్లోకి రావడానికి, కూర్చోవడానికి భక్తులు పడిన ఇబ్బందులను తెలుసుకున్నాం. వాటిని అధిగమించేలా చర్యలు చేపట్టాం.

### పెరటాసి రద్దీని తట్టుకునేలా..

తమిళ భక్తులకు ముఖ్యమైన పెరటాసితో పాటు బ్రహ్మోత్సవాలు కూడా రావడంతో రద్దీ ఎక్కువగా ఉంటుందని అంచనా వేశాం. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ దర్శనం, ప్రత్యేక దర్శనాలు రద్దు చేశాం. గరుడసేవకు ప్రొటోకాల్ దర్శనాన్నీ నిలిపేశాం. బ్రహ్మోత్సవాల రోజులకు సంబంధించి ఇప్పటికే 1.32 లక్షల దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో ఇచ్చాం. సర్వదర్శన టోకెన్లు రోజుకు 24వేల చొప్పున జారీ చేస్తాం. మామూలుగా 80 వేల మందికి దర్శనం చేయిస్తాం. కానీ బ్రహ్మోత్సవాల్లో రోజుకు 90 వేల నుంచి 95 వేల మంది దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశాం. మాడవీధుల్లోని గ్యాలరీల్లో 2 లక్షల మంది మాత్రమే కూర్చోగలరు. అదనంగా మాడవీధుల్లోని కార్నర్ క్యూలైన్ల ద్వారా దాదాపు 20 వేల మందికి వాహనసేవల దర్శనం చేయిస్తాం.

### నడకదారి భక్తులకు...

అలిపిరి మార్గంలోని వచ్చిన వారికి గతంలో దివ్యదర్శనం టోకెన్లు ఇచ్చేవారు. దాన్ని గతంలోనే రద్దు చేశారు. బ్రహ్మోత్సవాల తర్వాత ఆ విషయం ఆలోచిస్తాం. ప్రస్తుతం శ్రీవారిమెట్టు మార్గంలో వచ్చేవారికి దివ్యదర్శనం టోకెన్లు ఇస్తున్నాం. నడిచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రణాళికలు రూపొందించుకున్నాం.

### 60 వేల మందికి వసతి

తిరుమలోని 7వేల గదుల ద్వారా 40 వేల మందికి వసతి లభిస్తుంది. యాత్రికుల వసతి సముదాయాల్లోని 68 హాళ్లద్వారా 7 వేల లాకర్లు ఉన్నాయి. వీటి ద్వారా 20 వేల మందికి వసతి కల్పించవచ్చు. ఇక, 411 బస్సుల ద్వారా 3వేల ట్రిప్పులతో ఆర్టీసీ సేవలందిస్తుంది. 4 వేల వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశాం. నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తాం.భక్తులకు ఇబ్బంది లేకుండా 7 లక్షల లడ్డూల బఫర్ స్టాక్ ఉంచుకున్నాం. లడ్డూ కౌంటర్లు 54 నుంచి 65కు కౌంటర్లను పెంచాం.

### భక్తులకు భద్రత

తొలిరోజున సీఎం పర్యటనకు కూడా ఏర్పాట్లు పూర్తయ్యాయి. 3.5 లక్షల మంది భక్తులు గరుడసేవకు వస్తారని అంచనా. దానికి అనుగుణంగా అధికారులను, సిబ్బందిని సిద్ధం చేశాం. ఎక్కడా ఎక్కడ తోపులాటలు తొక్కిసలాటలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. 1,225 మంది విజిలెన్స్, 3,800 పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. 2,770 సీసీ కెమెరాల ద్వారా నిఘా పెడుతున్నాం.

# శాస్త్రోక్తంగా శ్రీవారి ఆలయ శుద్ధి



శ్రీవారి ఆలయ శుద్ధి కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు తదితరులు

తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈనెల 4వ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం ఉదయం ఈ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆనందనిలయం నుంచి బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయంలోపల ఉన్న ఉపఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామాగ్రిని నీటితో శుభ్రం చేశారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పేశారు. శుద్ధి తర్వాత నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతా ప్రోక్షణం చేశారు. తర్వాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిఉన్న వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజలు, నైవేద్య కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమ నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన అష్టదళ పాదపద్మారాధన, వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.తిరుమంజనం కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు,అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

# 227 మద్యం షాపులకు నోటిఫికేషన్

- తిరుమల బైపాస్ రోడ్డులో నో పర్మిషన్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 1: జిల్లాలో 227 ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్ నోటిఫికేషన్ జారీ చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనరు శ్రీనివాసాచారి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపుల్లో తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 32, గూడూరులో 12, నాయుడుపేటలో 13, సూళ్లూరుపేటలో 14, వెంకటగిరిలో 9, పుత్తూరులో 7, తిరుపతి రూరల్‌లో 12 చొప్పున ఉంటాయన్నారు. ఇవి కాకుండా జిల్లాలోని 26 మండలాల పరిధిలో 128 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయదానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఇక, తిరుమలకు విచ్చేసే యాత్రికులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తిరుపతికి ప్రత్యేకంగా మద్యం దుకాణాల ఏర్పాటులో కొన్ని నిబంధనలు విధించినట్లు తెలిపారు. ఆ ప్రకారం.. తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండు, పూర్ణకుంభం సర్కిల్ మీదుగా (తిరుమల బైపాస్) అలిపిరి వరకు.. తర్వాత రుయా, స్విమ్స్ వద్ద కూడా మద్యం షాపుల ఏర్పాటుకు అనుమతి లేదన్నారు. ఎవరైనా అనుమతులు అతిక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. మద్యం షాపుల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారు 9వ తేది సాయంత్రం 5 గంటల వరకు ఆయా ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్ ద్వారా లేదా హైబ్రిడ్ విధానంలో కానీ దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 11న ఉదయం 8 గంటలకు తిరుపతి శిల్పారామంలో లాటరీ విధానంద్వారా దుకాణాలను అదే రోజు కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు ఈ నెల 11 వరకు అందుబాటులో ఉంటాయని.. 12 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లో ఉంటుందన్నారు. దుకాణాల కేటాయింపు పారదర్శకంగా, చట్టబద్ధంగా జరుగుతుందని, ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

# అలిపిరిలో ఆ క్షణం

## చంద్రబాబుపై క్లెమోర్‌మైన్ దాడి జరిగి 21 ఏళ్లు

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



పేలుడుతో తలకిందులైన కారు - క్లెమోర్ మైన్‌లో వాడిన ఇనుప గోళాలు (ఇన్‌సెట్‌లో)



ఆస్పత్రిలో చంద్రబాబు



ధ్వంసమైన చంద్రబాబు కారు



తల్లి అమ్మణ్ణమ్మ దుఃఖం



విస్ఫోటనం తీవ్రతకు తెగిపడ్డ తీగలు - పేల్చడానికి వాడిన ఫ్లాష్ (ఇన్‌సెట్‌లో)

### 2003 అక్టోబరు1, సాయంత్రం 4.05 గంటలు..

అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమలేశుడికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు తిరుమలకు బయలుదేరారు. అలిపిరి టోల్‌గేట్ దాటగానే భారీ పేలుడు.. ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న బులెట్ ప్రూఫ్ కారు ఆకాశంలోకి ఎగిరి పడింది. క్లెమోర్ మైన్స్‌తో అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు చేసిన దాడి అది. కారులో చంద్రబాబుతో పాటూ అప్పటి మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు చదలవాడ కృష్ణమూర్తి, రెడ్డివారి రాజశేఖర రెడ్డి కూడా ఉన్నారు. అంత భారీ పేలుడులోంచి చంద్రబాబు సహా అందరూ గాయాలతో బయటపడడం విచిత్రం. ఆ దేవదేవుడి కరుణగా ఇప్పటికీ చెప్పుకుంటారు. అలిపిరి సంఘటనలో బాధితులూ, ప్రత్యక్ష సాక్ష్యుల 21 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు ఇవి...

### ఆ శబ్దం ఇప్పటికీ చెవుల్లో మోగుతోంది

పుత్తూరు అభివృద్ధి కోసం రూ.300కోట్లు కావాలని కోరుతూ ఒక ప్రణాళిక తయారు చేసుకున్నా. దానిని సీఎం చంద్రబాబుకు వివరించాలి. తిరుపతిలో కార్యక్రమాల ఒత్తిడిలో ఆయన ఉన్నందున సాధ్యం కాలేదు. తిరుమలకు వెళ్లేలోగా వివరించవచ్చని ఆయనతోపాటు కారులో ఎక్కి కూర్చున్నా. కాన్వాయ్ టోల్‌గేట్ దాటింది, మొదలుపెట్టబోతుండగా పెద్ద శబ్దం .. అంతే.. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదు. నేను బతకడం కష్టమని వైద్యులు చెప్పేశారట. అయితే చంద్రబాబు ఢిల్లీ, బెంగళూరుల నుంచి నిపుణులైన వైద్యులను పిలిపించారు. హెలికాప్టర్ తెప్పించి హైదరాబాద్‌కు తరలించారు. సమయం పట్టినా కోలుకున్నా. అమ్మ నాకు తొలి జన్మనిస్తే, అలిపిరి ఘటన మలి జన్మనిచ్చింది. ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తుంటా.



- రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి, అప్పటి పుత్తూరు ఎమ్మెల్యే

### కారు 20 అడుగులు ఎగిరి పడింది



ఆరోజు సీఎం చంద్రబాబుతో పాటు ప్రయాణిస్తున్నా. హఠాత్తుగా కారు 20 అడుగుల పైకి ఎగిరి కిందపడింది. పెద్ద శబ్దం మాత్రమే వినిపించింది. ఆ తర్వాత స్పృహ వచ్చేసరికి ఆస్పత్రి బెడ్‌పై ఉన్నా. కోలుకున్న తర్వాత అలిపిరిలో జరిగిందేమిటో కథలు కథలుగా చెబుతుంటే, శ్రీవారి కరుణాకటాక్షాలతోనే బతికామని అనిపిస్తుంటుంది. ఎక్కడైతే ఘటన జరిగిందో, అక్కడే టోల్‌గేట్ నిర్మించారు. టీటీడీ ఛైర్మన్‌గా తిరుమలకు వెళ్తూ సంఘటన జరిగిన ప్రదేశాన్నే తదేకంగా చూస్తూ ఉండేవాడిని. వెంకటేశ్వరస్వామి ప్రసాదించిన మరో జన్మలో జీవిస్తున్నా.



- చదలవాడ కృష్ణమూర్తి, అప్పటి తిరుపతి ఎమ్మెల్యే

### బ్లాస్ట్ .. సౌండ్.. దుమ్మూ...

సీఎం చంద్రబాబు స్విమ్స్ నుంచి తిరుమలకు బయలుదేరారు. లీడ్ కారులో డీఎస్పీ, నేనూ, మరో హెడ్ కానిస్టేబుల్ ఉన్నాం. టోల్‌గేట్ దాటుతుండగా వెనుక వస్తున్న వీఐపీ కారు మలుపు తిరిగిందా అని డీఎస్పీ చూడమన్నారు. నేను వెనక్కి తిరిగి చూస్తున్నా. పెద్ద బ్లాస్ట్ .. సౌండ్.. దుమ్మూ... బ్లాస్టింగ్ అని అర్థమైపోయింది. కారులోంచి దూకి వెనక్కి పరుగెత్తా. ఇంకా బాంబులుండచ్చు.. పేలచ్చు అని వారిస్తున్నా నేను వినలేదు. పొగలో ఎగిరి పడిపోయివున్న కారు వద్దకు చేరుకున్నా. ముందు సీటులో సీఎం పడిపోయి ఉన్నారు. వెనుక ముగ్గురు ఒకరిపై ఒకరు పడిపోయి ఉన్నారు. ముందుగా సీఎం గారిని కారులోనుంచి బయటకు తీశాం. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లాం. మరుసటి రోజు పేలని మరో 12 క్లెమోర్ మైన్స్ అక్కడ బయటపడ్డాయి. అవికూడా పేలివుంటే ఎవ్వరమూ మిగిలివుండేవాళ్లం కాదు. ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లో అటువంటి పరిస్థితిని ఎదుర్కొనే శక్తిని ఆ స్వామే నాకు ఇచ్చాడనిపిస్తుంది.





- అంజూ యాదవ్, పోలీసు అధికారి

### ఆ దృశ్యం మిగిలిపోయింది



టీవీ జర్నలిస్టుగా కాన్వాయ్‌తో పాటూ కొండకు బయలుదేరా. వెనుక కారులోంచి ముందుకు సాగిపోతున్న కార్ల బారును కెమెరాలో ఫోకస్ చేశా. ఇంతలో ఢాం.. అంటూ భారీ విస్ఫోటనం..ముందున్న కార్లు చిల్లాపల్లాలుగా పడిపోయాయి. కార్లోంచి దూకి కెమెరాను ఫోకస్‌లోనే పట్టుకుని తెగి పడివున్న తీగలు దాటుకుంటూ ముందుకు పరుగు తీశా.నల్లటి పొగ కమ్ముకుని ఉంది. గాల్లోకి ఎగిరిన రాళ్ల ముక్కలు మీద పడుతున్నాయి. సీఎం కారు ఎక్కడా అని వెతుక్కుంటున్నా. ఆ దుమ్మూ పొగలోనే బోల్తాపడివున్న కారు చుట్టూ సీఎం సెక్యూరిటీ కోటలా చుట్టుకుని ఉన్నారు. పడమటి దిక్కున కొండల వెనుక సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఎగిరి బోల్తాపడ్డ కారులోంచి చంద్రబాబును పైకి తీస్తున్నారు.. ఆ దృశ్యం నా కెమెరాలోనే కాదు నా గుండెల్లోనూ ఇప్పటికీ చెరగని ముద్రలా ఉండిపోయింది. మిగిలిన బాంబులు పేలివుంటే ఏమయ్యేది.. నేను చచ్చిపోయివుంటే మా అమ్మ ఏమైపోయేది.. అని ఆ తర్వాత తలుచుకుని వణికిపోయా.

- మునిరాజ, టీవీ జర్నలిస్టు

### తొలి ఫొటో నాదే!



చంద్రబాబు కాన్వాయ్ కొండకు బయలుదేరింది.వెనుక సెక్యూరిటీ కారులో నేనున్నా. 'దర్శనం ఎన్నిగంటలకు' అని పక్కనే ఉన్న సెక్యూరిటీ వాళ్లను అడుగుతూ ఉన్నా. ఇంతలో భారీ పేలుడు శబ్దం వినిపించింది. దట్టంగా పొగ.. అరుపులు..కేకలు.. కారులోంచి అందరం బయటకు దూకి సీఎం కారువైపు పరుగులు తీశాం. రోడ్డు పక్కన కాలువలో కారు పడిపోయివుంది. అప్రయత్నంగా నా చేతులు కెమెరాను ఎయిమ్ చేశాయి. సెక్యూరిటీ, పోలీసు సిబ్బందీ దెబ్బతిన్న కారులోంచి చంద్రబాబును పైకి తీస్తూ ఉన్నారు. క్లిక్..క్లిక్.. క్లిక్ మంటూ నా వేళ్లు నొక్కుతూనే ఉన్నాయి. ఇప్పటిలాగా అప్పుడు డిజిటల్ కెమెరాలు లేవు. ఫిలిం కెమెరాలే. దుమ్ము, పొగలో ఫొటోలు ఎలా వస్తాయో కూడా తెలీదు. టెన్షన్.. టెన్షన్. చివరికి ఆ ఫొటోలే అలిపిరి సంఘటనకు ప్రధానం అయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే తీసిన తొలి ఫొటో నాదే అయ్యింది.

- మాధవ్, అప్పటి సీఎం అధికారిక ఫొటోగ్రాఫర్

# నీరసంగా ఉన్నా.. కాలిబాటనే..!

- తిరుమల చేరుకున్న డిప్యూటీ సీఎం
- భద్రతా సమస్యఅంటూ తొలుత పోలీసుల అభ్యంతరం
- అలిపిరి వద్ద అయోమయం
- చివరకు నడకమార్గాన్నే ఎంచుకున్న పవన్
- మార్గమధ్యంలో కాళ్ల నొప్పి బాధించినా నడక కొనసాగింపు

తిరుపతి/తిరుమల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన కారణంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నీరసంగా ఉన్నప్పటికీ.. నడక దారినే తిరుమల చేరుకున్నారు. 11 రోజుల దీక్ష విరమణకు గాను మంగళవారం మధ్యాహ్నం పవన్ తిరుపతికి చేరుకున్నారు. ప్రాయశ్చిత్త దీక్షలో ఉన్న తనకు స్వాగతసత్కారాలు, హడావిడి, ఆర్భాటాలకు దూరంగా ఉండాలని జనసేన శ్రేణులు, అభిమానులకు ఆదేశాలిచ్చారు. దీంతో వీరెవరూ విమానాశ్రయానికి వెళ్లలేదు. కేవలం కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయులు మాత్రమే పవన్‌కు స్వాగతం పలికారు. సాయంత్రం 4 గంటలకు అలిపిరి చేరుకున్నారు. నడక దారిలో తిరుమల వెళ్లాలంటే.. అటవీ మార్గం కావడంతో భద్రతా సమస్యలు ఎదురవుతాయని పోలీసులు అభ్యంతరం తెలిపారు. అభిమానుల హడావిడితో పాటు భక్తులకూ ఇబ్బంది కలుగుతుందని వివరించారు. రోడ్డు మార్గాన వెళ్లాలని కోరారు. తనకు భద్రతాపరమైన సమస్య ఏమీ లేదని, నడిచే వెళతానని తొలుత భీష్మించినా.. చివరికి ఆయన డైలమాలో పడ్డారు. ఈ క్రమంలో వెనుదిరిగి పద్మావతి అతిథి గృహానికి వెళ్లారు. శ్రీవారి మెట్టు మార్గాన వెళ్లడంపైనా కాసేపు చర్చించారు. చివరకు అలిపిరి నడక దారినే ఎంచుకుని 4.50 గంటలకు పాదాల మండపం నుంచి బయల్దేరారు. ఇలా గంట పాటు అయోమయం నెలకొంది. ఏ మార్గంలో పవన్ వెళతారో తెలియక తొలుత 20 నిమిషాల పాటు నడకదారిలో భక్తులను ఆపేశారు. రోడ్డు మార్గాన వెళతారనే ఉద్దేశంతో అరగంట పాటు వాహనాలనూ నిలిపేశారు. దీంతో రెండు మార్గాల్లోనూ కొంతసేపు భక్తులు ఇబ్బంది పడ్డారు.


అలిపిరి పాదాల మండపం వద్ద కాలిబాటన బయలుదేరి


తిరుమలలోని అతిథి గృహం వద్ద పవన్‌కు స్వాగతం పలుకుతున్న టీటీడీ రిసెప్షన్ అధికారులు


కాళ్ల నొప్పికి విశ్రాంతి తీసుకుంటూ..

## అలసి.. సొలసినా

ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరేసరికి పవన్ కల్యాణ్ బాగా అలసిపోయి సొమ్మసిల్లిపోయారు. కాసేపు మెట్లపైనే ఒరిగిపోయినట్టు పడుకున్నారు. నీరసానికి తోడు వెన్ను, కాళ్ల నొప్పితో ఆయన ఇబ్బంది పడ్డారు. స్విమ్స్‌కు చెందిన ఫిజియో థెరపిస్టుతో వైద్యం చేయించుకోవడంతోపాటు అక్కడక్కడా ఆగి విశ్రాంతి తీసుకుంటూ నడక సాగించారు. చివరికి నాలుగున్నర గంటల వ్యవధి నడక ముగించి రాత్రి 9.24 గంటలకు తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. ఈయనతో పాటు నేతలు పసుపులేటి హరిప్రసాద్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారుడు మదన్, ప్రముఖ ఆర్కిటెక్చర్ ఆనంద్‌సాయి కూడా కాలినడకన తిరుమలకు వచ్చారు. కాగా, అభిమానుల తోపులాటలో సామాన్య భక్తులు అక్కడక్కడ ఇబ్బంది పడ్డారు. రోపులతో భద్రతా సిబ్బంది నెట్టివేయడంతో జీఎన్సీ వద్ద చాలా మంది భక్తులు అగచాట్లు పడ్డారు. చిన్నపిల్లలతో వచ్చిన భక్తులు నెట్టేస్తారనే భయంతో పవన్ కల్యాణ్ వెళ్లేంతవరకు నడకమార్గానికి దూరంగా నిలబడిపోయారు.


పవన్‌తో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

## పవన్‌ను కలిసిన అటవీశాఖ అధికారులు

అలిపిరి నడక మార్గంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద తిరుపతి సీఎఫ్‌వో నాగేశ్వరరావు, ఎస్వీ జూపార్కు పర్యవేక్షకుడు సెల్వం పవన్‌ను కలిశారు. నడక మార్గంలో చిన్నారి లక్షితపై చిరుత దాడి చేసిన తర్వాత తీసుకున్న చర్యలను వివరించారు. భవిష్యత్తులో చేపట్టబోయే పనులు, అభివృద్ధికి సంబంధించి మ్యాప్‌ను చూపి తెలియజేశారు.

## డిప్యూటీ సీఎంకు భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం): అలిపిరి నడక మార్గంలో తిరుమల చేరుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ప్రభుత్వం, టీటీడీ యంత్రాంగం భారీ భద్రత ఏర్పాటు చేసింది. పవన్ పర్యటన నేపథ్యంలో ముందుగానే కాలిబాట, ఘాట్‌రోడ్డు ప్రాంతాలను రిజర్వు బలగాలు పరిశీలించాయి. అడుగడుగునా తనిఖీలు చేశాయి. ఇక, పవన్ వెంట నడక దారిలో పోలీసులు వలయంగా ఏర్పడి రక్షణ కల్పించారు. మొదట సివిల్ పోలీసులు.. రెండో దశలో ఎస్టీఎఫ్ బలగాలు.. మూడో దశలో ఏపీఎస్పీ బలగాలతో పవన్‌కు భద్రత కల్పించారు. వీరంతా బృందాలుగా ఏర్పడి నడక మార్గంలో పవన్ కల్యాణ్‌కు ముందు వెనుక కూంబింగ్ నిర్వహిస్తూ వచ్చారు. ఒక దశలో జనసందడి, అభిమానులు, పార్టీ శ్రేణులను కట్టడి చేయడానికి పోలీసులకు ఇబ్బందిగా మారింది. కాగా, దాదాపు 300 మంది పోలీసులు కాలిబాటలో బందోబస్తు నిర్వహించారు. ఇక పవన్ పర్యటన పొడవునా.. తిరుమలలో సుమారు దాదాపు 800 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## జిల్లాలో 98.24శాతం పింఛన్ల పంపిణీ


అక్కారంపల్లిలో పింఛన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 1: జిల్లాలో తొలి రోజైన మంగళవారం 98.24శాతం మందికి యంత్రాంగం పింఛన్లను పంపిణీ చేసింది. తద్వారా రాష్ట్రంలో జిల్లా నాలుగో స్థానం దక్కించుకుంది ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు నగదు అందించారు. జిల్లాలోని 691 సచివాలయ పరిధిలో 2,61,644మందికి రూ.110కోట్లు పంపిణీ చేశారు. ఉదయాన్నే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు తిరుపతి నగరం అక్కారంపల్లిలో పింఛన్లను పంపిణీ చేశారు.

## రుయా డిప్యూటీ సీఎస్ఆర్ఎంవోగా శ్రీనివాస్



తిరుపతి(వైద్యం), అక్టోబరు 1: రుయాస్పత్రి డిప్యూటీ సీఎస్ఆర్ఎంవోగా డాక్టర్ శ్రీనివాసులను నియమిస్తూ డీఎంఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం రుయాస్పత్రిలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవోగా నియమిస్తూ సూపరింటెండెంట్ రవిప్రభు ఉత్తర్వులు జారీ చేశారు. కొంత కాలంగా రుయాస్పత్రిలో రెగ్యులర్ సీఎస్ఆర్ఎంవో పోస్టును భర్తీ చేయకపోవడం వలన ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవోగా శ్రీనివాసులకు బాధ్యతలు అప్పగించారు.

## పకడ్బందీగా ఇంటింటా ఓటరు సర్వే

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు1: ఎన్నికల ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా ఇంటింటా ఓటరు సర్వేను జిల్లాలో పకడ్బందీగా చేపడుతున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంపై అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ మంగళవారం వర్చువల్ విధానంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటింటా ఫొటో ఎలక్టోరల్ జాబితా వెరిఫికేషన్ 99.81 శాతం అయిందన్నారు. అన్ని ఫారాలకు సంబంధించి 25,473 పెండింగ్ క్లెయిమ్‌లు, అభ్యంతరాలు ఉన్నాయని, గడువులోపు పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు చనిపోయిన వారి వివరాలు 7,117కు గాను 6,305 దరఖాస్తుల పరిశీలన పూర్తికాగా, మిగిలిన 812ను 3లోపు పరిష్కరిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ నిబంధనలమేరకు చేపడుతున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మౌర్య, డీఆర్వో పెంచలకిషోర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగపు సిబ్బంది, ఈఆర్వోలు, డిప్యూటీ తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో 900 టన్నుల ఎర్రచందనం వేలం


సెంట్రల్ గోడౌన్‌లో ఎర్రచందనాన్ని పరిశీలిస్తున్న ధరల నిర్ధారణ కమిటీ

మంగళం, అక్టోబరు 1: అటవీశాఖ త్వరలో 900 టన్నుల ఎర్రచందనానికి గ్లోబల్ టెండర్ల ద్వారా వేలం వేయనుంది. మంగళవారం తిమ్మినాయుడుపాళెం వద్ద గల సెంట్రల్ గోడౌన్‌లోని ఎర్రచందనాన్ని పీసీసీఎఫ్‌కే సుమన్ ఏర్పాటు చేసిన ధరల నిర్ణయ కమిటీ పరిశీలించింది. గోదాములోని 50 లాట్లలో ఎర్రచందనం దుంగలు గ్రేడ్లను పరిశీలించడంతోపాటు దుంగల రంగులను రికార్డు చేశారు. ఎర్రచందనం విక్రయాల ద్వారా ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గతంలో ఏ గ్రేడ్ టన్ను రూ.65లక్షలనుంచి రూ.75లక్షల వరకు బీగ్రేడ్ రూ.30 లక్షలు నుంచి రూ.35లక్షలు వరకు సీ గ్రేడ్ రూ.20లక్షలు ఉండేవి. ఈ సారి ధరలను పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గోదాములో పరిశీలించిన కమిటీలో సీసీఎఫ్ నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి సెల్వం, స్టేట్‌సెల్వి కల్బరిస్టు యశోదబాయి, సెంట్రల్ గోడౌన్ డీఎఫ్‌వో శివకుమార్ ఉన్నారు.

## వెంచరుకు దారి కోసం గయ్యాలి భూమి ఆక్రమణ

- రియల్టర్లపై గ్రామస్థుల ఆగ్రహం


యంత్రాలతో రాతి బండల తొలగింపు

చంద్రగిరి, అక్టోబరు 1: చంద్రగిరి మండలం ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలో ప్రైవేటు వెంచర్‌కు రోడ్డు కోసం ప్రభుత్వ భూమిలోని గయాలు పరంబోకు స్థలాన్ని రియల్టర్లు ఆక్రమించారు. అందులో బండరాళ్లను తొలగించడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలో భూములకు భారీ డిమాండు ఉంది. ఈ క్రమంలో కొందరు రియల్టర్లు తమ పట్టా భూములలో ప్లాట్లు వేశారు. దానికి దారి లేకపోవడంతో ప్రభుత్వ భూమిలోని గయ్యాలి పరంబోకు స్థలాన్ని దారిగా చూపారు. పంచాయతీ, తుడా నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వేసిన ప్లాట్లు విక్రయించారు. ఇప్పుడు ఆ ప్లాట్లకు ఆరేపల్లి రంగంపేట లెక్కదాఖల్లోని సర్వే నెంబర్ 249-2లో 0.42 సెంట్ల గయ్యాలి భూమిని ఆక్రమించి, యంత్రాలతో రాతి బండలను తొలగించే పనులు చేపట్టారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు.

## వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతిరూరల్, అక్టోబరు 1: తుమ్మలగుంటలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గర్భాలయంతోపాటు ప్రధాన ఆలయాన్ని శుద్ధి చేసి.. పవిత్ర పరిమళ జలంతో సంప్రోక్షణం చేశారు. ఈనెల3నుంచి జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తెలిపారు.



## బ్రహ్మోత్సవాలకు 5,145 మందితో భద్రత: డీజీపీ

తిరుమల, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు 5,145 మందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ద్వారక తిరుమలరావు తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆర్టీసీ డిపోను పరిశీలించారు. తర్వాత సిట్ బృందంతో సమావేశమై మూడురోజులుగా జరిపిన విచారణ నివేదికను అందుకుని పరిశీలించారు. ఆ తర్వాత బ్రహ్మోత్సవాల్లో భద్రతపై గోకులం గెస్ట్‌హౌస్‌లో పోలీసు, విజిలెన్స్ అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం పర్యటనకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 8వ తేదీన జరిగే గరుడోత్సవానికి కూడా దాదాపు 4 వేల మంది సిబ్బందితో పాటు అదనంగా 1,250 మందిని బందోబస్తులో ఉంచుతామన్నారు. సామాన్య భక్తులకు ఎక్కడ ఇబ్బంది లేకుండా ప్రణాళికలు రూపొందించుకున్నట్టు తెలిపారు. పాతనేరస్తులపై నిఘా ఉంచడంతో పాటు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తామన్నారు. 2,700 సీసీ కెమెరాలతో నిరంతరాయంగా నిఘా ఉంచుతామన్నారు. గ్యాలరీల్లోని సామర్థ్యం మేరకే భక్తులను అనుమతిస్తామన్నారు. తిరుమలలో 8 వేల వాహనాలకు పార్కింగ్ ఉందని, ఆపై వచ్చే వాటిని తిరుపతిలోనే నిలిపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు 1930 ట్రిప్పులతో 1.70 లక్షల మందిని, గరుడోత్సవం రోజున 2714 ట్రిప్పులతో 2.50 లక్షల మంది భక్తులను తరలించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. పండుగ సమయాల్లో ఆర్టీసీలో ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని స్పష్టం చేశారు. ఆర్టీసీ జిల్లా ప్రజారవాణాధికారి, కడప జోనల్ ఈడీ చెంగల్ రెడ్డి డీజీపీని కలిశారు.

## అన్నప్రసాదాల రుచిలో మార్పు వచ్చింది


అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న ఎంపీ అప్పలనాయుడు

తిరుమల, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చిన భక్తులకు ప్రస్తుతం అందజేస్తున్న అన్నప్రసాదాల రుచిలో చాలా మార్పు వచ్చిందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన మధ్యాహ్నం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదాలు స్వీకరించారు. భక్తులతో మాట్లాడారు. చాలా మంది భక్తులు అన్నప్రసాదాలు ప్రస్తుతం బాగున్నాయని తెలిపారు. అనంతరం ఆయన టీటీడీ ఈవో శ్యామలరావును కలిసి.. విజయనగరం పార్లమెంటు పరిధిలో నాలుగు కల్యాణ మండపాలు నిర్మించాలని, రణస్థలం మండలం కొండమూలం గ్రామంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి సాయం చేయాలని కోరారు.

## సౌత్‌ఇండియాలో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి


ఎన్‌ఎల్ఎస్ఏ సంఘం జెండాని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 1: దక్షిణాది రాష్ట్రాల్లో సుప్రీంకోర్టు బెంచ్‌ని ఏర్పాటు చేయాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఎస్వీయూలోని సెనేట్‌హాల్‌లో మంగళవారం దక్షిణాది ప్రాంతంలో సుప్రీంకోర్టు బెంచ్ అవసరం, దాని ఆవశ్యకతపై సదస్సును నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్‌ని ప్రారంభించారు. వక్తలుగా హాజరైన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, గాలి వినోద్‌కుమార్, జి.భానుప్రకాశ్‌రెడ్డి, కేఎస్ వాసు మాట్లాడుతూ లాకమిషన్ రిపోర్ట్ దక్షిణాదిలో చెన్నై, హైదరాబాద్‌లో, ఉత్తరాదిలో ఢిల్లీలో, తూర్పున కలకత్తాలో, పశ్చిమాన ముంబైలో సుప్రీంకోర్టు బెంచ్‌లు ఏర్పాటు చేయాలని సూచించినా దాన్ని పక్కనబెట్టారని విమర్శించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.సుందరరాజు, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రగిరి ఎక్సైజ్ సీఐగా ఫణీంద్ర



చంద్రగిరి, అక్టోబరు 1: చంద్రగిరి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐగా ఫణీంద్ర, ఎస్ఐలు ఎం.సుధాకర్, కె.గిరితో పాటు ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. తాడిపత్రి నుంచి బదిలీపై ఈయన చంద్రగిరికి వచ్చారు. చంద్రగిరిలోని ఎక్సైజ్ ఎస్ఐ జయశంకర్ తిరుపతి అర్బన్‌కుబదిలీ అయ్యారు. ఓబులాపురం చెక్‌పోస్టులో ఎస్ఐగా ఉన్న కె.గిరి, ప్రొద్దుటూరులో ఐఎంఎల్ డిపోలో ఎస్ఐగా ఉన్న ఎం.సుధాకర్ బదిలీపై చంద్రగిరికి వచ్చారు. వీరితో పాటు ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లు కొత్తగా వచ్చారు.

## వ్యవసాయ, ఔషధ రంగాల్లో శిలీంద్రాలది కీలక భూమిక

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 1: వ్యవసాయ, ఔషధ రంగాల్లో శిలీంద్రాలు(ఫంగీ) కీలక భూమిక పోషిస్తున్నాయని ఎస్వీయూ వీసీ అప్పారావు తెలిపారు. ప్రపంచ ఫంగస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీలోని మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సుని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ దామోదర్ శెనుయారు, శ్రీలంకకు చెందిన ప్రొఫెసర్ జయలాల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్‌ముండ్రా, డాక్టర్ స్మృతివసంతియా, శ్రీధర్, ప్రొఫెసర్ చింతలపరమగీతం తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రారంభం

పాకాల, అక్టోబరు 1: పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టును సోమవారం ఎంఈవో బాబ్జీ, హెచ్ఎం మహమ్మద్ రఫీ ప్రారంభించారు. పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు మండల స్థాయి పోటీలకు వచ్చారన్నారు. ఈపోటీల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి పాకాల విద్యార్థులు డి.లతీఫ్, ఎస్.అక్షయ్, ఎస్.గణేష్‌లు, ప్రైవేట్ యాజమాన్యం నుంచి విజయ ఉన్నత పాఠశాల, దామలచెరువు విద్యార్థులు ఎం.మహిమతన్మై, పి.అభినవ్, పి.సాగర్ మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. వీరిని జిల్లా స్థాయి పోటీలకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. పాకాల మండల కన్వీనర్ జయచంద్ర, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం



చంద్రగిరి, అక్టోబరు 1: ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రకృతి వ్యవసాయదారుడు కొమ్మినేని దామోదర నాయుడు అన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రైతులు చేపట్టాలనే ఉద్దేశంతో విద్యార్థులలో చైతన్యం తీసుకురావడమే తన లక్ష్యమన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం చంద్రగిరి మండలం పనపాకం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై ఆయన అవగాహన కల్పించారు. 16 రకాల కూరగాయలు, ఆకు కూరల విత్తనాలను విద్యార్థులతో విత్తించారు.

## నెయ్యిలో కల్తీ వాస్తవమే

- అయితే జంతువుల కొవ్వు కలవలేదన్న చింతా

సూళ్లూరుపేట, అక్టోబరు 1: 'నెయ్యిలో కల్తీ జరిగిన మాట వాస్తవమే. కానీ జంతువుల కొవ్వు కలపలేదు. నేను స్వయంగా పరిశీలించా. లడ్డూకు వాడే నెయ్యి కల్తీ జరిగిందన వల్లే వాసన కూడా రావడం లేదు' అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ వ్యాఖ్యానించారు. సూళ్లూరుపేటలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కిలో ఆవు నెయ్యి రూ.700పైగా ధర ఉంటే.. టీటీడీకి రూ.320 చొప్పున ఎలా సరఫరా చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఇది కల్తీ లేకపోతే ఎలా సాధ్యమో చెప్పాలన్నారు. గతంలో తిరుమలలో పర్చేస్ కమిటి పొరపాటు చేసినందున ఇదంతా జరిగిందన్నారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు తొందరపడి మాట్లాడారని అన్నారు. తిరుమల పవిత్రతను గత పాలకవర్గం వారు దెబ్బతీసేశారని ఆరోపించారు.

## డిజిలాకర్‌పై అవగాహన



చంద్రగిరి, అక్టోబరు 1: చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట గ్రామంలో మోహన్‌బాబు విశ్వవిద్యాలయం విద్యార్థులు, వలంటీర్లు, నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్‌సీసీ) ద్వారా డిజిలాకర్ ఉపయోగం గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం ఎంబీయూ ఏఐఎంఎల్ విభాగ హెచ్‌వోడీ డాక్టర్ నరేంద్రకుమార్ రావు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ శివప్రసాద్, విద్యార్థి కోఆర్డినేటరు గొట్టి పునీత్, విద్యార్థులు, వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి డిజిలాకర్‌లో డాక్యుమెంట్లను ఎలా భద్రపరచుకోవాలి, ఎటువంటి ప్రయోజనాలు ఉంటాయి అనే విషయాలు వివరించారు. డాక్యుమెంట్లు ఎక్కడికైనా సులభంగా పంపడం, వాటిని కాపీగా ఉంచుకోవడం, ఫిజికల్ డాక్యుమెంట్ల అవసరం లేకుండా సురక్షితంగా భద్రపరచడం వంటి ప్రయోజనాలు వివరించారు.

## రేపటి నుంచి నవరాత్రి మహోత్సవాలు

చంద్రగిరి, అక్టోబరు 1: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో గురువారం నుంచి 12వ తేది వరకు దేవీనవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో పుట్టా రామకృష్ణారెడ్డి తెలిపారు. 3న ఉదయం 8.30 నుంచి 9.13 గంటల మధ్య తులా లగ్నంలో కలశస్థాపనతో ప్రారంభం కానున్నాయి. 4న సాయంత్రం పెద్ద శేష, శ్రీలక్ష్మి.. 5న గజవాహనంపై గజలక్ష్మిగా, 6న నంది వాహనంపై అన్నపూర్ణ దేవిగా, 7న గరుడ వాహనంపై నారాయణిగా, 8న హంస వాహనంపై సరస్వతీదేవిగా, 9న అశ్వ వాహనంపై గాయత్రిదేవిగా, 10న సాయంత్రం సింహ వాహనంపై రాజరాజేశ్వరిదేవిగా, 11న పూలతేరుపై దుర్గాదేవిగా, 12న పుష్పపల్లకిలో మహిషాసుర మర్ధిని అలంకరణలో మూలస్థాన ఎల్లమ్మ భక్తులకు దర్శనమిస్తారని ఆయన పేర్కొన్నారు.

## కార్మికుల నిరసనతో మద్యం షాపుల మూత



తిరుపతిలో మూతపడిన మద్యం దుకాణం

తిరుపతి(నేరవిభాగం)/చంద్రగిరి, అక్టోబరు 1: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది మంగళవారం నిరసన తెలిపారు. దీంతో జిల్లాలో మద్యం షాపులు ఉదయం నుంచి సాయంత్రం వరకు మూతపడ్డాయి. ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేసుకొంటూ జీవనం సాగిస్తున్న తాము.. ఆ దుకాణాలను ప్రైవేటు పరం చేయడంతో రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వకుండా ఈ నిర్ణయం తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

## తిరుమలలో దర్శకుడు త్రివిక్రమ్



తిరుమల, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం ప్రముఖ సినీ దర్శకుడు త్రివిక్రమ్ మంగళవారం తిరుమల వచ్చారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బస చేసే గాయత్రి అతిథిగృహంలోనే ఆయన కూడా బస చేశారు. బుధవారం ఉదయం పవన్‌తో కలిసి ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు. కాగా, పవన్ కల్యాణ్ కుమార్తె ఆద్య కూడా శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు.

## అమ్మవారి సేవలో డీజీపీ



తిరుచానూరు, అక్టోబరు 1: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ స్పెసిఫైడ్ అధికారిని నియమించండి: బీజేపీ



తిరుపతి (జీవకోన), అక్టోబరు 1: 'తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలంటే టీటీడీ బోర్డు లేనందున స్పెసిఫైడ్ అథారిటీని నియమించి భక్తులకు మెరుగైన సేవలు అందించాలి' అని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. తిరుపతిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. టీటీడీ పాలకమండలి నియామకం ఆలస్యం అవుతున్న నేపథ్యంలో సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన స్పెసిఫైడ్ అథారిటీని నియమించాలన్నారు.

## లాక్రోస్ ఛాంపియన్ షిప్ విజేత ఆంధ్రా జట్టు



తిరుపతి(క్రీడలు), అక్టోబరు 1: లాక్రోస్ చాంపియన్‌షిప్ పోటీలలో ఆంధ్రా జట్టు అత్యుత్తమ ప్రదర్శనతో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. గత నెల 26నుంచి 30వరకు యూపీలోని ఆగ్రాలో జాన్‌పబ్లిక్ మిల్టన్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన నేషనల్ లాక్రో చాంపియన్‌షిప్, ఫెడరేషన్‌కప్ పోటీల్లో 19 రాష్ట్రాల నుంచి బాల బాలికల జట్లు పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ జట్టు జూనియర్ బాలుర విభాగంలో ప్రథమస్థానం సాధించి, సౌత్ ఇండియా నుంచి తొలిసారిగా ఛాంపియన్‌గా నిలవడం పట్ల తిరుపతికి చెందిన ఏపీ లాక్రోస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సురేంద్రరెడ్డి, ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మునికృష్ణయ్య, కోచ్ శివ, ఫిజికల్ డైరెక్టర్ బలరాం తదితరులు క్రీడాకారులను అభినందించారు.

## క్రీడా సామగ్రి వితరణ



తిరుపతి(క్రీడలు), అక్టోబరు 1: తిరుపతి గ్రామీణ మండలం మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ట్రెండ్స్ ఉన్నతపాఠశాలకు దాతలు మంగళవారం క్రీడా సామగ్రిని వితరణ చేశారు. తిరుపతికి చెందిన రోటరీక్లబ్ ప్రతినిధులు రూ.50వేలు విలువచేసే బేస్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్ మెటీరియల్, సామగ్రిని పాఠశాల హెచ్ఎం కేశవులు నాయుడుకు అందజేశారు. రోటరీక్లబ్ ప్రెసిడెంట్ సోమురవికుమార్, సభ్యుడు శరణ్‌రెడ్డి, భార్గవ, శివాజీ, మునస్వామి శెట్టి, భాగ్యమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రణాళికలు సిద్ధం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 1: జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రణాళికలను సిద్ధం చేయాలని జేసీ శుభం బన్సల్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, రైతు సంఘాలు, వాణిజ్యసంస్థలు, ప్రముఖులు, జిల్లా అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా మండల, జిల్లా స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతిశాఖ స్వర్ణాంధ్ర లక్ష్యంగా విజన్ రూపకల్పనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజరెడ్డి, సీపీవో, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృత వర్సిటీలో ముగిసిన సదస్సు

తిరుపతిరూరల్, అక్టోబరు 1: తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీలో ట్రాన్స్‌లేషన్ టెక్నిక్స్ అండ్ ఛాలెంజస్ అనే అంశంపై రెండ్రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్వీ వేదవర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి మాట్లాడుతూ.. అనువాదమనేది జ్ఞానాన్ని ఇతరులకు అందించే గొప్ప సాధనమని, దీనికి భాషా పరిజ్ఞానం ఎంతో అవసరమని వివరించారు. హైదరాబాద్‌వర్సిటీ తెలుగు విభాగ ప్రొఫెసర్ డి.విజయలక్ష్మి మాట్లాడుతూ జానపద సాహిత్యం ద్వారా సామాన్య ప్రజలకు ఏవిధమైన జ్ఞానాన్ని అందించవచ్చనేది వివరించారు. రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా, సత్యనారాయణాచార్య, కోఆర్డినేటర్స్ ఎంజీ నందనరావు, డాక్టర్ కనపాలకుమార్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆదాయం రూ.5.05 కోట్లు

తిరుమల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.05 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ప్రకటించింది. సోమవారం 66,986 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,163 మంది తలనీలాలు సమర్పించారు.

## జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 1: జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సేవా దృక్పథం, పౌరహక్కుల చట్టం, అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన ఉండి ఆసక్తి ఉన్నవారు ఈ నెల 15లోగా దరఖాస్తుచేసుకోవాలన్నారు. తిరుచానూరు రోడ్డులోని ఎస్సీ, సంక్షేమ, సాధికారత అధికారి, సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో పనివేళలో స్వయంగా అందజేయాలని కోరారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం



పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య

తిరుపతి (జీవకోన), అక్టోబరు 1: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ 2024 కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక వినాయకనగర్ పరిసర ప్రాంతాల్లో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ... తిరుపతి నగరంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. కలుషిత రహిత నగరంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్య ఉద్దేశమన్నారు. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించే స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో శానిటరీ వర్కర్స్, యూడీఎస్ వర్కర్స్‌ను సన్మానించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, ఇంజనీరింగ్ అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటింటికీ పెన్షన్ల పంపిణీ



పెన్షన్లు పంపిణీ చేస్తున్న నరసింహయాదవ్, ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇంటింటికీ పెన్షన్ల పంపిణీ మంగళవారం సందడిగా సాగింది. స్థానిక 35వ డివిజన్లో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణలు సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎస్వీఎం శ్రీధర్, యూనిట్ ఇంచార్జి శ్రీలక్ష్మి, మైనం సురేష్, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ఆరోగ్యం బాగుండాలని కొబ్బరికాయల సమర్పణ



కొబ్బరికాయలు కొడుతున్న ఆనందనాయుడు తదితరులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 1: 20 సంవత్సరాల క్రితం శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తుండగా అలిపిరి వద్ద బాంబుదాడికి గురైన సీఎం చంద్రబాబుకు పునర్జన్మను ప్రసాదించిన శ్రీవారికి కృతజ్ఞతలు తెలుపుతూ టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అత్తులూరు ఆనంద నాయుడు మంగళవారం అలిపిరి పాదాల మం డపం వద్ద 101 కొబ్బరికాయలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్యం ఎల్లప్పుడూ బాగుండాలని ప్రతి ఏటా అక్టోబర్ 1న పాదాల మండపంలో కొబ్బరికాయల మొక్కు తీర్చుకుంటున్నట్లు చెప్పారు. అత్తులూరు భాను చౌదరి, శివానందం, రమణ, చలపతి, జీవీ రత్నం, పి.రవీంద్రారెడ్డి, పి.కిరణ్‌కుమార్‌పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ

తిరుపతి (జీవకోన), అక్టోబరు 1: పండుగ వాతావరణంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక 1వ డివిజన్ అక్కారంపల్లి, సుబ్బారెడ్డి నగర్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్యతో కలసి పింఛన్లను ఇంటింటికి పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి నెలా సచివాలయ అధికారులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేస్తున్నారన్నారు. జిల్లాలో 2,66,342మందికి సచివాలయ అధికారుల ద్వారా రూ.112.71కోట్లు పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. ప్రతి సచివాలయ ఉద్యోగి తమ పరిధిలోని లబ్ధిదారులకు వందశాతం పింఛను పంపిణీ చేయాలన్నారు. స్థానిక కార్పొరేటర్ పాల్గొన్నారు.

## రేపు రాష్ట్ర సచివాలయంలో

### మహిళా ఉద్యోగులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 1: అమరావతి సచివాలయంలోని మహిళా ఉద్యోగులకు ఈ నెల 3న పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచిస్తూ స్విమ్స్ శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ప్రత్యేకాధికారి డాక్టర్ జయచంద్రారెడ్డికి డీఎంఈ నుంచి ఆదేశాలు అందాయి. సచివాలయంలోని మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని కోరుతూ అమరావతిలోని సచివాలయం మహిళా ఉద్యోగ సంఘాల నేతలు ఇటీవల ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలని ఆదేశించడం జరిగింది. ఈ మేరకు స్విమ్స్ శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో ఈనెల 3న అమరావతిలోని సచివాలయంలో మహిళా ఉద్యోగులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు బీఐవో ప్రత్యేకాధికారి డాక్టర్ జయచంద్రారెడ్డి తెలిపారు.

## ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుధారాణి



తిరుపతి(విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 1: ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వయోజన విద్యావిభాగ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుధారాణిని నియమిస్తూ మంగళవారం వీసీ అప్పారావు ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఆమె వీసీనుంచి ఉత్తర్వులను అందుకున్నారు.

## నేడు వివేకానంద సెంటర్ ఆఫ్ హ్యూమన్ ఎక్సెలెన్సీ ప్రారంభం

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 1: తిరుపతి, వినాయక నగర్‌లోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో బుధవారం వివేకానంద సెంటర్ ఆఫ్ హ్యూమన్ ఎక్సెలెన్సీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్వామి బలభద్రానంద(సహాయ ప్రధాన కార్యదర్శి, రామకృష్ణ మఠం, మిషన్, కొలకత్తా) పాల్గొన్ని శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అలాగే ఉచిత ఆయుర్వేద ఆస్పత్రిని స్వామి సత్యజ్ఞానానంద (అధ్యక్షులు, రామకృష్ణా మఠం, చెన్నయ్.) ప్రారంభిస్తారు. యువతకు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరిచే ఈ శిక్షణ కేంద్రంలో రూ.500 ఫీజుతో కంప్యూటరు విజ్ఞానం, అకౌంటింగ్, స్పోకెన్ ఇంగ్లీషు నేర్పిస్తారు. పూర్తి అటెండెన్స్ కలిగిన విద్యార్థులకు ఫీజు తిరిగి చెల్లిస్తారని, ఉదయం మహిళలకు, సాయంత్రం పురుషులకు విడిగా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద తెలిపారు.

## 11, 12 తేదీల్లో రోలర్ స్కేటింగ్ పోటీలు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 1: ఈనెల 11, 12 తేదీలలో నగరపాలక సంస్థ పరిధిలోని ప్రకాశం పార్కులో ఉమ్మడి జిల్లా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 5నుంచి 17వరకు వయస్సున్న బాలబాలికలు మాత్రమే అర్హులు. ఇందులో రాణించినవారు త్వరలోనే కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. ఆసక్తిగలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 70135 04345 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

# పుత్తూరు వార్తలు

## ఏచూరి బాటలో నడుద్దాం: ఎమ్మెల్యే భాను


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పుత్తూరు టౌన్, అక్టోబర్ 1: దేశాభివృద్ధికి కృషి చేసిన సీతారాం ఏచూరిని ఆదర్శంగా తీసుకుని, ఆయన చూపిన బాటలో నడవాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవన కార్యాలయంలో సోమవారం దివంగత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను పట్టణ కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శ్రామికల సమస్యలపై ఉద్యమాలు, కష్టజీవులకు అండగా నిలిచి అనేక పోరాటాలతో సమస్యలను పరిష్కరించారని గుర్తు చేశారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా సీతారం ఏచూరి నిలిచారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వి నాగరాజన్, టీడీపీ నాయకులు చినబాబు, మాజీ ఎంపీపీలు గంజి మాధవయ్య, డీ.ఎస్.ఎలుమలై, వడమాలపేట జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, దళిత సంఘ నాయకుడు నందయ్య, సీపీఎం నాయకులు భాస్కర్, విజయ్, శివ, యాసీన్ బాషా, రమేష్ పాల్గొన్నారు.

## శ్రీవారి గొడుగుల ఊరేగింపు



వడమాలపేట, అక్టోబర్ 1: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తమిళనాడు నుంచి గొడుగులతో పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు వడమాలపేటలో ఘనస్వాగతం పలికారు. ఏటా శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా చెన్నై నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి సమర్పించేందుకు పాదయాత్రగా గొడుగులతో తిరుమలకు చేరుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో మంగళవారం ఊరేగింపుగా వెళ్తున్న గొడుగులకు భక్తులు భక్తిప్రపత్తులతో కర్పూర హారుతలిచ్చారు. శ్రీవారి పాదుకలకు, పూజాద్రవ్యాల పెట్టెకు పూజలు నిర్వహించారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన


పింఛన్ల పంపిణీలో మాధవయ్య

పుత్తూరు అర్బన్, అక్టోబరు 1: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుందని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య అన్నారు. మంగళవారం తడుకు పంచాయతీ మజ్జిగగుంటలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. పుత్తూరు మున్సిపాలిటీ 20వ వార్డు కల్యాణపురం ఎస్టీ కాలనీలో పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకులు గాలి గోపినాథ్, ఈశ్వర్ యాదవ్, కనకయ్య, కుప్పయ్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## 98 శాతం పింఛన్ల పంపిణీ

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 1: పుత్తూరు మున్సిపాలిటీలో మొదటి రోజు 98 శాతం పింఛన్ల పంపిణీ జరిగినట్టు ఇన్‌చార్జి కమిషనర్ వీఎల్ఎన్ మూర్తి తెలిపారు. మొదటి రోజు 98 మంది సిబ్బంది 5,774 మందికి గాను 5,635 లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. రూ.2.46 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా రూ.2.40 కోట్ల పంపిణీ చేసినట్లు తెలిపారు.

## క్రీడా పోటీల్లో ఫిజియోథెరపీ విద్యార్థుల ప్రతిభ



పుత్తూరు, అక్టోబరు 1: రాష్ట్ర స్థాయిలో స్పార్క్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిజియోథెరపీ కళాశాలల క్రీడలు, సాంస్కృతిక పోటీలలో పుత్తూరు కెకెసీ ఫిజియోథెరపీ విద్యార్థులు వాలీబాల్, బ్యాడ్మింటన్, డ్యాన్స్ పోటీలలో ప్రథమ స్థానాలను సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల చైర్మన్ కుప్పయ్యశెట్టి మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలలోనూ విద్యార్థులు రాణించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నరసింహారావు, అడ్వయిజర్ హరినాథశెట్టి, ప్రిన్సిపాల్ మగేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## అట్టహాసంగా శ్రీవారి గొడుగుల ఊరేగింపు




పుత్తూరు, అక్టోబరు 1: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తిరు మల బ్రహోత్సవాలకు వెళ్తున్న శ్రీవారి గొడుగులను మంగళవారం పుత్తూరు పట్టణంలోని వీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా తొలుత ఆర్‌డీఎం గేటు వద్ద శ్రీవారి పాదాలకు పూజలు నిర్వహించారు. ఊరేగింపునకు ముందు వీధులను నీళ్లతో శుద్ధి చేసి వరుసగా కోలాటాలు, భజనలు చేశారు.

## విజేతలకు బహుమతుల పంపిణీ

పుత్తూరు, అక్టోబరు 1 : మండలంలోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్వర్ణాంధ్ర 2047లో భాగంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ కుమార్ బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక, పారిశ్రామికీకరణ, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం రంగాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కోరారు. హనుమంతరావు, కిషోర్, వేలాయుధ ఆచ్చారి, రామకృష్ణ, సుగుణ, హరీష్‌లు పాల్గొన్నారు.

## గాంధీ సిద్ధాంతాలు ఆచరణీయం

పుత్తూరు టౌన్, అక్టోబర్ 1: గాంధీజీ నేర్పిన సత్యం, ధర్మం, అహింస సిద్ధాంతాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య తెలిపారు. సోమవారం కళాశాలలో ముందస్తు గాంధీ జయంతిని జరుపుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ వీరయ్య, సమన్వయ కర్త పి.సుజన, టి.నరసింహులు, కృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోండి

పుత్తూరు టౌన్, అక్టోబర్ 1: సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి చెప్పారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికలు) జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టుకు 20 పాఠశాలల హాజరవగా, అందులో మొదటిస్థానంలో రాచపాలెం పాఠశాల, రెండో స్థానంలో పీహెచ్‌హెచ్ గొల్లపల్లి, మూడో స్థానంలో పీహెచ్‌సీ పుత్తూరు పాఠశాలలు నిలిచాయి. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు సిద్ధమవుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు.

# గూడూరు

# సూళ్లూరుపేట/వెంకటగిరి

## 9 ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

వెంకటగిరి టౌన్, అక్టోబరు 1: నాయుడుపేట మండలంలోని స్వర్ణముఖి నది నుంచి వెంకటగిరి పట్టణంలోకి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 9 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

## మహిళ మెడలో గొలుసు అపహరణ

గూడూరు అర్బన్, అక్టోబరు 1: మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించుకు వెళ్లిన సంఘటన మండలంలోని చెన్నూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... చెన్నూరు గ్రామానికి చెందిన నీరజ వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని ఐదు సవర్ల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రశాంతంగా జెండా ఉత్సవాలు జరుపుకుందాం: పాశిం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 1: పట్టణంలో బుధవారం నిర్వహించనున్న ఆంజనేయ స్వామి జెండా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రోటరీ భవనంలో పోలీసు అధికారులు, జెండా ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరులో నిర్వహించే జెండా ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. ఉత్సవాల సమయంలో ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. గతంలో బయటప్రాంతాల నుంచి రౌడీషీటర్లు ఉత్సవాలకు వచ్చి అల్లర్లకు పాల్పడ్డారని, ఈసారి అలాంటి సంఘటనలు జరకుండా పోలీసులు, నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణకుమార్, సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, కిషోర్‌బాబు, ఎస్‌ఐలు తిరుమలరావు, గోపాల్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

### ముస్తాబైన పట్టణం


విద్యుద్దీపాలంకరణ కటౌట్

ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలకు పట్టణం ముస్తాబైంది. ఏటా విజయదశమి ముందు వచ్చే అమావాస్య నాడు గూడూరులో ఆంజనేయస్వామి జెండాలను ఊరేగించడం ఆనవాయితీ. పట్టణంలో సుమారు 30 ప్రాంతాల్లో జెండా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా గమళ్లపాళెం, మిట్టపాళెం, తూర్పు వీధి, కర్ణాలవీధి, కోనేటిమిట్ట, మాళవ్యానగర్ తదితర ప్రాంతాల్లో భారీ విద్యుత్ దీపాలతో వివిధ దేవుళ్ల కటౌట్‌లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని వీధులన్నీ విద్యుద్దీపాలకరణతో శోభాయమానంగా మారాయి.

## లడ్డూ నెయ్యిలో కల్తీ వాస్తమే.. కానీ జంతువుల కొవ్వు కాదు: చింతా


మీడియాతో మాట్లాడుతున్న చింతా మోహన్

సూళ్లూరుపేట, అక్టోబరు 1: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో కల్తీ వాస్తవమేనని, అయితే జంతువుల కొవ్వు కాదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో ఏమి కల్తీ చేశారో నిర్ధారించిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడి ఉండాల్సిం దని, ఆయన తొందరపాటు వల్ల భక్తుల్లో అపోహలు కలిగాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పాలకవర్గం అవినీతికి పాల్ప డిందని ఆరోపించారు. కిలో ఆవు నెయ్యి రూ.700 పైచిలుక ధర పలుకుంటే రూ.320కి ఎలా సరఫరా చేస్తారని, కల్తీ లేకపోతే ఎలా సాధ్యమని ప్రశ్నిం చారు. కమీషన్లకు కక్కుర్తి పడి ఉన్న భవనాలను కూల్చి సత్రాల పేరుతో కొత్త నిర్మాణాలు చేపట్టారని విమర్శించారు. సూళ్లూరుపేటలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని, పరిశ్రమలు వస్తే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని, ముఖ్యంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణంపై సీఎం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందనమూడి శివ, ఈశ్వరయ్య, జి.వెంకటయ్య, ఎస్‌కే నాగూర్ బాబు, కేవీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

వాకాడు, అక్టోబరు 1: కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో 20 మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. మంగళవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 11న కలెక్టర్ నేతృత్వంలో లాటరీ తీసి లైసెన్స్ కేటాయిస్తామని, 12వ నుంచి కొత్త దుకాణాలను ప్రారంభించుకోవచ్చన్నారు.

## సీఎం సహాయనిధికి విరాళం


నెలవలకు చెక్కును అందజేస్తున్న తాళ్వాయిపాడు గ్రామస్తులు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 1: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి కనుపూరు మండలం తాళ్వాయిపాడు గ్రామస్తులు రూ.50వేల విరాళం అందజేశారు. మంగళవారం రాత్రి నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంను కలిసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, తాళ్వాయిపాడు గ్రామస్తులు కిలారి గోపీ, బాలయ్య, శ్రీనివాసులు, చలపతి, మహేశ్వరయ్య పాల్గొన్నారు.

## విద్యతోనే ఉన్నత శిఖరాలకు...


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 1: విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో పాటు ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులతో సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలిగినప్పుడు వారి మధ్య బేధాభిప్రాయాలు ఉండవన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న కోర్సులకు మంచి అధ్యాపకులు ఉన్నారని, అంతేకాకుండా విద్యార్థులకు కావాల్సిన పరికరాలు అందుబాటులో ఉండటం సంతోషదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన వర్మ, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పెసల జయరాజ్‌గోపాల్, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, 786 రఫీ, నాగేంద్రరెడ్డి, పసల గంగాప్రసాద్, మైలారి రాజశేఖర్, అరవపెరిమిడి చంద్రారెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఇంటింటా ఓటరు సర్వే

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు1: ఎన్నికల ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా ఇంటింటా ఓటరు సర్వేను జిల్లాలో పకడ్బందీగా చేపడుతున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంపై అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్ మంగళవారం వర్చువల్ విధానంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటింటా ఫొటో ఎలక్టోరల్ జాబితా వెరిఫికేషన్ 99.81 శాతం అయిందన్నారు. అన్ని ఫారాలకు సంబంధించి 25,473 పెండింగ్ క్లెయిమ్‌లు, అభ్యంతరాలు ఉన్నాయని, గడువులోపు పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు చనిపోయిన వారి వివరాలు 7,117కు గాను 6,305 దరఖాస్తుల పరిశీలన పూర్తికాగా, మిగిలిన 812ను 3లోపు పరిష్కరిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ నిబంధనలమేరకు చేపడుతున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మౌర్య, డీఆర్వో పెంచలకిషోర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగపు సిబ్బంది, ఈఆర్వోలు, డిప్యూటీ తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు




శ్రీకాళహస్తి, అక్టోబరు 1: మండలంలో వేడాంలో కొలువై ఉన్న దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహు కాలంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

## వేడుకగా కాలభైరవుడి ప్రాకారోత్సవం



శ్రీకాళహస్తి, అక్టోబరు 1: శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరడి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం అభిషేకాలు, ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయస్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణ చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు.

## ఆంజనేయుడికి విశేష పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 1: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు. భక్తులు తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు ది స్కూల్ విద్యార్థులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 1: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో మండలస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ది స్కూల్ హెచ్‌ఎం విశాల తెలిపారు. శాస్త్రీయ ఆచరణపై జరిగిన పోటీల్లో చేతన, భవిత, ఎస్.హాఫ్స ప్రతిభ చూపారన్నారు.

## జిల్లాలో 98.24శాతం పింఛన్ల పంపిణీ


అక్కారంపల్లిలో పింఛన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 1: జిల్లాలో తొలి జు 98.24శాతం మందికి జిల్లా యంత్రాంగం పింఛన్లను పంపిణీ చేసింది. రాష్ట్రంలో నాలుగో స్థానం దక్కించుకుంది ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు నగదు అందించారు. జిల్లాలోని 691 సచివాలయ పరిధిలో వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఇలా మొత్తం 2,61,644మందికి రూ.110కోట్లు పంపిణీ చేశారు. ఉదయాన్నే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు తిరుపతి నగరం అక్కారంపల్లిలో పింఛన్లను పంపిణీ చేశారు.

## రుయా డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవోగా శ్రీనివాస్



తిరుపతి(వైద్యం), అక్టోబరు 1: రుయాస్పత్రి డిప్యూటీ సీఎస్ఆర్‌ఎంవోగా డాక్టర్ శ్రీనివాసులను నియమిస్తూ డీఎంఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం రుయాస్పత్రిలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను ఇన్‌చార్జి సీఎస్‌ఆర్‌ఎంవోగా నియమిస్తూ సూపరింటెండెంట్ రవిప్రభ ఉత్తర్వులు జారీ చేశారు. కొంత కాలంగా రుయాస్పత్రిలో రెగ్యులర్ సీఎస్‌ఆర్‌ఎంవో పోస్టును భర్తీ చేయకపోవడం వలన ఇన్‌చార్జి సీఎస్‌ఆర్‌ఎంవోగా శ్రీనివాసులకు బాధ్యతలు అప్పగించారు.

## త్వరలో 900 టన్నుల ఎర్రచందనం వేలం


సెంట్రల్ గోడౌన్‌లో ఎర్ర చందనాన్ని పరిశీలిస్తున్న ధరల నిర్ధారణ కమిటీ

మంగళం, అక్టోబరు 1: అటవీశాఖ త్వరలో 900 టన్నుల ఎర్రచందనానికి గ్లోబల్ టెండర్ల ద్వారా వేలం వేయనుంది. మంగళవారం తిమ్మినాయుడుపాళెం వద్ద గల సెంట్రల్ గోడౌన్‌లోని ఎర్రచందనాన్ని పీసీసీఎఫ్‌కే సుమన్ ఏర్పాటు చేసిన ధరల నిర్ణయ కమిటీ పరిశీలించింది. గోదాములోని 50 లాట్లలో ఎర్రచందనం దుంగలు గ్రేడ్లను పరిశీలించడంతోపాటు దుంగల రంగులను రికార్డు చేశారు. ఎర్రచందనం విక్రయాల ద్వారా ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గతంలో ఏ గ్రేడ్ టన్ను రూ.65లక్షలనుంచి రూ.75లక్షల వరకు బీగ్రేడ్ రూ.30 లక్షలు నుంచి రూ.35లక్షలు వరకు సీ గ్రేడ్ రూ.20లక్షలు ఉండేవి. ఈ సారి ధరలను పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గోదాములో పరిశీలించిన కమిటీలో సీసీఎఫ్ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి సెల్వం, స్టేట్‌సెల్వి కల్చరిస్టు యశోదబాయి, సెంట్రల్ గోడౌన్ డీఎఫ్‌వో శివకుమార్ ఉన్నారు.

## రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు వెంకటకార్తీక్

గూడూరు, అక్టోబరు 1: మండలంలోని నెల్లటూరు ఉన్నత పాఠశాల విద్యార్థి వెంకటకార్తీక్ రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పార్వతమ్మ తెలిపారు. నెల్లూరులో నిర్వహించిన జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో వెంకటకార్తీక్ అండర్-17 బాలుర విభాగంలో ప్రతిభ చాటడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హెచ్‌ఎంతో పాటు పీడీ విజయ వెంకటకార్తీక్‌ను అభినందించారు.

# నీరసంగా ఉన్నా.. కాలిబాటనే..!

- తిరుమలకు చేరుకున్న డిప్యూటీ సీఎం
- భద్రతపై తొలుత పోలీసుల అభ్యంతరం
- అలిపిరి వద్ద అయోమయం
- చివరకు నడకమార్గాన్నే ఎంచుకున్న పవన్
- మార్గమధ్యంలో కాళ్ల నొప్పి బాధించినా నడక కొనసాగింపు


అలిపిరి పాదాల మండపం వద్ద కాలిబాటన బయలుదేరి

తిరుపతి/తిరుమల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన కారణంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నీరసంగా ఉన్నప్పటికీ.. నడక దారినే తిరుమల చేరుకున్నారు. 11 రోజుల దీక్ష విరమణకు గాను మంగళవారం మధ్యాహ్నం పవన్ తిరుపతికి చేరుకున్నారు. ప్రాయశ్చిత్త దీక్షలో ఉన్నందున తనకు స్వాగతసత్కారాలు అవసరం లేదని, హడావిడి, ఆర్భాటాలకు దూరంగా ఉండాలని జనసేన శ్రేణులు, అభిమానులకు ఆదేశాలిచ్చారు. దీంతో విమానాశ్రయానికి ఎవరూ వెళ్లలేదు. కేవలం కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయులు మాత్రమే పవన్‌కు స్వాగతం పలికారు. అక్కడ్నుంచి సాయంత్రం 4 గంటలకు అలిపిరి చేరుకున్నారు. నడక దారిలో వెళ్లాలంటే.. అటవీ మార్గం కావడంతో భద్రతా సమస్యలు ఎదురవుతాయని, ఇంటెలిజెన్స్ విభాగం కూడా హెచ్చరించిందని పోలీసులు తెలిపారు. అభిమానుల హడావిడితో పాటు భక్తులకూ ఇబ్బంది కలుగుతుందని వివరించారు. రోడ్డు మార్గాన వెళ్లాలని కోరారు. తనకు భద్రతాపరమైన సమస్య ఏమీ లేదని, నడిచే వెళతానని తొలుత భీష్మించినా.. చివరికి ఆయన డైలమాలో పడ్డారు. ఈ క్రమంలో వెనుదిరిగి పద్మావతి అతిథి గృహానికి వెళ్లారు. శ్రీవారి మెట్టు మార్గమైతే ఎలా ఉంటుందని కాసేపు చర్చించారు. చివరకు అలిపిరి నడక దారినే ఎంచుకుని 4.50 గంటలకు పాదాల మండపం నుంచి కాలినడకన బయల్దేరారు. దీంతో గంట పాటు అలిపిరి వద్ద అయోమయం నెలకొంది. పవన్ ఏ మార్గంలో వెళతారో తెలియక తొలుత 20 నిమిషాల పాటు భక్తులను నడక దారిలో ఆపేశారు. రోడ్డు మార్గాన వెళతారనే ఉద్దేశంతో అరగంట పాటు వాహనాలనూ నిలిపేశారు. దీంతో రెండు మార్గాల్లోనూ కొంతసేపు భక్తులు ఇబ్బంది పడ్డారు.


తిరుమలలోని అతిథి గృహం వద్ద


పవన్‌తో అటవీశాఖ అధికారుల భేటీ

అలిపిరి నడక మార్గంలోని లక్ష్మీనరసింహ ఆలయం వద్ద పవన్‌ను తిరుపతి సీఎఫ్‌వో నాగేశ్వర రావు, ఎస్వీ జూపార్కు పర్యవేక్షకుడు సెల్వం కలిశారు. నడక మార్గంలో చిన్నారి లక్షితపై చిరుత దాడి చేసిన తర్వాత తీసుకున్న చర్యలను వివరించారు. భవిష్యత్తులో చేపట్టబోయే పనులు, అభివృద్ధికి సంబంధించి మ్యాప్‌ను చూపి తెలియజేశారు.

### అలసి.. సొలసినా



ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరేసరికి పవన్ కల్యాణ్ బాగా అలసిపోయి సొమ్మసిల్లిపోయారు. కాసేపు మెట్లపైనే ఒరిగిపోయినట్టు పడుకున్నారు. నీరసానికి తోడు వెన్ను, కాళ్ల నొప్పితో ఆయన ఇబ్బంది పడ్డారు. స్విమ్స్‌కు చెందిన ఫిజియో థెరపీ చేయించుకోవడంతోపాటు అక్కడక్కడా ఆగి విశ్రాంతి తీసుకుంటూ నడక సాగించారు. చివరికి నాలుగున్నర గంటల్లోనే నడక ముగించి రాత్రి 9.24 గంటలకు తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. ఈయనతో పాటు నేతలు పసుపులేటి హరిప్రసాద్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారుడు మదన్, ప్రముఖ ఆర్కిటెక్చర్ ఆనంద్‌సాయి కూడా కాలినడకన తిరుమలకు వచ్చారు. కాగా, అభిమానుల తోపులాటలో సామాన్య భక్తులు అక్కడక్కడ ఇబ్బంది పడ్డారు. రోప్‌లతో భద్రతా సిబ్బంది నెట్టివేయడంతో జీఎన్సీ వద్ద భక్తులు అగచాట్లు పడ్డారు. చిన్నపిల్లలతో వచ్చిన భక్తులు నెట్టేస్తారనే భయంతో పవన్ కల్యాణ్ వెళ్లేంతవరకు నడకమార్గానికి దూరంగా నిలబడిపోయారు.

### పవన్‌కు భారీ భద్రత

పవన్ కల్యాణ్ తిరుమల పర్యటనకు ప్రభుత్వం, టీటీడీ యంత్రాంగం భారీ భద్రత కల్పించింది. ఆయన వెంట నడక దారిలో వంద మంది పోలీసులు వలయంగా ఏర్పడి రక్షణ కల్పించారు. దీనికి అదనంగా టీటీడీ సెక్యూరిటీ, ఎస్పీఎఫ్, ఏపీఎస్‌పీ, రిజర్వు పోలీసు బలగాలు బృందాలుగా ఏర్పడి ముందు వెనుకల కూంబింగ్ నిర్వహిస్తూ సాగాయి.

## శాప్ చైర్మన్‌కు సన్మానం



వరదయ్యపాళెం, అక్టోబరు 1: శాప్ చైర్మన్‌గా నియమితులైన అనిమిని రవి నాయుడును మంగళవారం వరదయ్యపాళెంకు చెందిన తిరుపతి పార్లమెంటు తెలుగుయువత నాయకుడు పృథ్వీచౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. సత్యవేడు నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి

సత్యవేడు, అక్టోబరు 1: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ ప్రతిమ, జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి చెప్పారు. ఎంపీడీవో కార్యాయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. సమతుల ఆహారంతోనే ఆరోగ్యం కలుగుతుందన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు రక్తహీనతపై అవగాహన కల్పించి, బాలామృతం, రాగిపిండి, అటుకుల ప్రాముఖ్యత వివరించాలని కోరారు. అనంతరం సామూహిక సీమంతం నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## 4న పల్లికొండేశ్వరాలయ దుకాణాల వేలం

నాగలాపురం, అక్టోబరు 1: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయ ఆవరణలోని పలు దుకాణాలకు సంబంధించి ఈనెల 4న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో లత తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలోని కూల్‌డ్రింక్స్ షాపుకి సంబంధించి నవంబరు 5నుంచి 2025 నవంబరు 4వ తేదీ వరకు, అలాగే ఇత్తడి పూజ సామాన్లు, స్వామివారి వస్త్రాల విక్రయానికి డిసెంబరు 1 నుంచి 2025 నవంబరు 30 వరకు, పిల్లల ఆట వస్తువుల విక్రమం, భక్తుల పాదరక్షలు భద్రపరిచి రుసుము వసూలు చేసుకోవడానికి అక్టోబరు 5 నుంచి 2025 అక్టోబరు 4 వరకు షాపులను పొందుటకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ఆలయ కార్యాలయంలో రూ:10 వేలను ధరావతుగా చెల్లించాల్సి ఉంటుందని ఈవో తెలిపారు.

## భూమి చదునుపై దుమారం



శ్రీకాళహస్తి, అక్టోబరు 1: పట్టణ శివార్లలోని రామచంద్రాపురం వద్ద ప్రభుత్వ భూమిని గుర్తు తెలియని వ్యక్తులు చదును చేయడంపై దుమారం రేగింది. పిచ్చాటూరు రహదారికి అనుకుని కొంత ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు యంత్రాలతో చదును చేశారు. ఉదయం భూమి చదును చేసిన విషయాన్ని గుర్తించిన స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. కోట్ల రూపాయల విలువైన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో ఈ విషయం మంగళవారం పెద్దఎత్తున వైరల్‌గా మారింది.

## పొన్నేరి భూముల పరిశీలన



పొన్నేరి భూ రికార్డులు పరిశీలిస్తున్న ఈవో

శ్రీకాళహస్తి, అక్టోబరు 1: తమిళనాడు రాష్ట్రం పొన్నేరి ప్రాంతంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెందిన భూములను ఈవో చంద్రశేఖర్ ఆజాద్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇటీవల ఆయన ఎఫ్ఏసీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. దీంతో ముక్కంటి ఆలయ ఆస్తుల రికార్డులను పరిశీలించారు. ఇందులోభాగంగా పొన్నేరి తాలుకా వల్లూరు గ్రామంలో 24.25 ఎకరాల భూమి ముక్కంటి ఆలయానికి చెందినదిగా ఆలయ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టేందుకు ఆయన మంగళవారం అధికారుల బృందంతో పొన్నేరికి వెళ్లారు. వల్లూరు గ్రామంలో ఉన్న ఆలయ భూమిని పరిశీలించి అక్కడి స్థానిక అధికారులతో చర్చించారు. ముక్కంటి ఆలయ భూమికి సరిహద్దులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సతీష్‌మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూమిలో

## హెచ్చరిక బోర్డు తొలగింపు

ఏర్పేడు, అక్టోబరు 1: మండలంలోని సీతారాంపేట పంచాయతీ వెంకటాపురం సర్వే నెం.262/4లో 0.90 సెంట్ల భూమిలోకి ప్రవేశించకూడదంటూ తహసీల్దారు ఆదేశాలతో హెచ్చరిక బోర్డును రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ఈ బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. సదరు సర్వే నెంబరు పక్కన 2.82 ఎకరాలను సీతారాంపేట దళితవాడకు చెందిన మల్లీశ్వరమ్మ పేరిట 1983లో ప్రభుత్వం పట్టా అందజేసింది. అప్పటి నుంచి ఆమె సాగు చేసుకుంటోంది. పక్కనే ఉన్న 90సెంట్ల ప్రభుత్వ భూమిని దున్ని సాగు చేసుకుంటోంది. ఈక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కె.నరసింహులు ఆ భూమికి తన పేరిట పట్టాలున్నాయని దున్నకాలు చేపట్టారు. దీనిపై ఇరువర్గాలు తహసీల్దారుకు ఫిర్యాదు చేశాయి. రికార్డులు పరిశీలించిన తహసీల్దారు ఆ 90సెంట్లు బండిబాటగా గుర్తించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు ఆ బోర్డును తొలగించారు.

## క్విజ్ పోటీలు

ఏర్పేడు, అక్టోబరు 1: మండలంలోని పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థుకు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

# అర్హులందరికీ పింఛన్ల పంపిణీ



పింఛను అందజేస్తున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, అక్టోబరు 1: అర్హులందరికి 1వ తేదీన ఉదయమే ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ల పంపిణీ చేయడం హర్షణీయమని టీడీపీ పట్టణాధ్యక్షులు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని 19వ వార్డు పరిధిలో మంగళవారం వేకువ జామున 5గంటల నుంచి విజయకుమార్ సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికి వెళ్లిపింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే హామీ ప్రకారం పింఛన్లను పెంచడంతో పాటు 1వ తేదీ ఉదయమే అర్హుల ఇంటి వద్ద అందజేసే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. పింఛన్ల లబ్ధిదారులందరూ దీనిపై ఎంతో సంతోషకరంగా ఉన్నారన్నారు. పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్ 12వ వార్డులో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పింఛన్ల పంపిణీ చేశారు.

**ఏర్పేడు:** మండలంలోని మర్రిమంద పంచాయతీలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరం ధనంజయులునాయుడు ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ జరిగింది. అదే విధంగా ఆమందూరు పంచాయతీలో తెలుగు యువత మండల అధ్యక్షుడు, సర్పంచ్ గుణయాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నాగరాజునాయుడు, మునిరెడ్డి, వరదయ్య, సీతాపతి ఆచారి తదితరులు పాల్గొన్నారు. ● వ్యాసాశ్రమాన్ని మంగళవారం టీడీపీ నేతలు సందర్శించారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు పింఛన్లను అందజేశారు. పీఠాధిపతి పరిపూర్ణనందగిరిస్వామి ఆశీర్వచనం పొందారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, నాయకులు గుణయాదవ్, రమణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవాలకు అమ్మవారి ఆలయాల ముస్తాబు



శీతాలాంబ ఆలయం ముందు ఏర్పాట్లు - విద్యుత్ దీపాలంకరణలో శీతాలాంబ ఆలయం

శ్రీకాళహస్తి, అక్టోబరు 1: దసరా ఉత్సవాలకు అమ్మవారి ఆలయాలు శరవేగంగా ముస్తాబవుతున్నాయి. శ్రీకాళహస్తిలో వాడవాడలా కొలువైన అమ్మవారి ఆలయాల్లో ఈ ఏడాది పది రోజుల పాటు దసరా ఉత్సవాలు జరగను న్నాయి. 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దసరాల ఉత్సవాల కోసం 15రోజుల ముందు నుంచే అమ్మవారి ఆలయాల్లో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి ఉత్సవాలు ఆరంభం కానున్న నేపథ్యంలో మంగళవారం నుంచి అమ్మవారి ఆలయాల వద్ద పండగ శోభ నెలకొంది. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా పట్టణంలోని కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ కొండపై విద్యుద్దీప అలంకరణ ఆకట్టుకుంటోంది. ఇక కొత్తపేటలోని శీతాలాంబ ఆలయం, బహదూరుపేట కన్యకాపరమేశ్వరి, బజారువీధిలోని కన్యాకాపరమేశ్వరి, ముత్యాలమ్మ, నింబజాదేవి, అష్టలక్ష్మి, తెట్టు నల్లగంగమ్మ, వేదాంలో దక్షిణ కాళికాదేవి ఆలయాల వద్ద విద్యుత్ దీపాలంకరణ చేశారు.

# మూతబడిన మద్యం షాపులు

- ఉద్యోగుల నిరసన
- నిరీక్షించిన మందుబాబులు
- రేణిగుంటలో అధిక ధరలకు విక్రయాలు



బీఎన్‌కండ్రిగలో మద్యం కోసం వేసి ఉన్న మందుబాబులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 1: ప్రైవేటు మద్యం షాపులు వద్దంటూ మండలంలోని మద్యం షాపుల్లో పని చేస్తున్న సిబ్బంది బీఎన్‌కండ్రిగలోని మద్యం దుకాణం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేటు మద్యం షాపులు తీసుకు వచ్చి తమకు మొండి చెయ్యి చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని కోరారు. అయితే కొత్త పాలసీ నేపథ్యంలో మండలంలోని ఐదుషాపులు మూత పడ్డాయి. మద్యం కోసం మందుబాబులు పడిగాపులు కాశారు.

**వరదయ్యపాళెం:** ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం మూతపడ్డాయి. నూతన మద్యం పాలసీకి వ్యతిరేకంగా వరదయ్య పాళెంలో మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది నిరసన తెలిపారు. సందిట్లో సడేమియా అన్న చందంగా బెల్టు షాపుల్లో వ్యాపారం బాగా సాగింది.

**రేణిగుంట:** ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద ఆఖరిరోజు కుమ్మేశారు. ప్రతి మద్యం దుకాణంలో అధిక ధరలకు మద్యం విక్రయించారు. మంగళవారం మండలవ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో క్వార్టర్ బాటిల్‌పై రూ.10, ఆఫ్‌కు రూ.20, ఫుల్‌కు రూ.50లెక్కన విక్రయించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల ఎచివరి రోజు కావడంతో ఎపుడు ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుస్తారో అని మద్యం ప్రియులు బ్రాండ్లతో సంబంధం లేకుండా దొరికింది దొరికినట్లు కొనుగోలు చేశారు. ఎక్సైజ్ అధికారులు అధిక ధరల విషయమై పట్టించుకోకపోవడం గమనార్హం

## రెండు ఇసుక లారీల సీజ్



రేణిగుంట, అక్టోబరు 1: ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను గాజులమండ్యం పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని తండ్లంలో అక్రమంగా ఇసుకను తవ్వి రెండు లారీల్లో లోడ్ చేసి పైన పట్ట కప్పి తరలిస్తుండగా గాజులమండ్యం పోలీసులు గుర్తించారు. ఆ లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు.

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



పంట కాలువ పూడిక తీత

ఏర్పేడు, అక్టోబరు 1: పరిసరాల శుభ్రంగా ఉంటే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ సూచించారు. మండలంలోని ఐఐటీ సమీప గ్రామమైన చిందేపల్లిలో సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిందేపల్లిలో పంటకాలువల పూడికతీత, పిచ్చి మొక్కలను తొలగించారు. స్వచ్ఛతా హీ సేవ నోడల్ అధికారి ఆర్ఎస్‌కే చైతన్య, సుబ్బారెడ్డి, వెంకటరమణ, మహేష్, చిందేపల్లి సర్పంచ్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

### అన్నమాచార్య కళాశాలలో

## త్రిష్ణ పోస్టరు ఆవిష్కరణ



రేణిగుంట, అక్టోబరు 1: అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోజియం త్రిష్ణ పోస్టర్, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ నాదమునిరెడ్డి హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ... త్రిష్ణలో టెక్నికల్, నాన్ టెక్నికల్, రోబోటిక్స్ అంశాలు ఉంటాయన్నారు.

## విద్యా సామగ్రి పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 1: మండలంలోని పెద్దపాలేడు పంచాయతీలోని మూలబొంద గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు సంజీవ సింహా ట్రస్టు చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో త్రివిక్రమరావు, వైద్యాధికారి దివాకర్ మంగళవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు.

సత్యవేడు: మండలంలోని నీలితొట్టి కండ్రిగ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సత్యవేడుకు చెందిన ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మురళి (కోళ్ళచిన్న) విద్యా సామగ్రిని వితరణగా అందించారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు, నారాయణ, సుభాష్, గుణశేఖర్, మనిశేఖర్, రామచంద్రయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి

## కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 1: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ కూడలి వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ... డిగ్రీలు పూర్తి చేసిన యువత స్వీపర్లు, డ్రైవర్లుగా బతకాల్సిన దుస్థితి ఎదురైందన్నారు. ఉద్యోగ ప్రయత్నాలతో పాటు స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించాలని యువతకు సూచించారు. ప్రస్తుతం స్వచ్ఛమైన నెయ్యికి మంచి గిరాకీ ఉందన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకు ఆవులను ఇచ్చి వారి ద్వారాస్వచ్ఛమైన నెయ్యిని కొనుగోలు చేసి తిరుమలతో పాటు ఇతర ఆలయాలకు సరఫరా చేయడం ద్వారా స్థానిక యువతకు మంచి ఉపాధి లభిస్తుందని సూచించారు. ఉచిత బస్సు పథకాన్ని మహిళలకు ఎపుడు అమలు చేస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు.

### గంగమ్మ ఆలయంలో

## నేటినుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

రేణిగుంట, అక్టోబరు 1: స్థానిక గంగమ్మ ఆలయంలో బుధవారం నుంచి దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు సోలా మల్లికార్జునరెడ్డి తెలిపారు. 12వ తేదీ వరకు ఆలయంలో ప్రతిరోజు ఒక్కో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. 8న మరు పొంగళ్లు, సాయంత్రం ఊరేగింపు, 12న అమ్మవారు విశ్వరూప దర్శనం ఉంటాయని తెలిపారు.

## రెండేళ్లుగా వేతనాల్లేవు!

కేవీబీపురం, అక్టోబరు 1: మండలంలోని కళత్తూరు, ఎస్ఎల్‌పురం పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్య కార్మికులకు గత రెండేళ్లుగా వేతనాలు చెల్లించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాలకు పంచాయతీ ఎన్నికలు జరగకపోవడంతో సర్పంచు లేరు. సర్పంచు లేకపోవడంతో వీరికి వేతనాలు చెల్లించేవారు లేదని వాపోతున్నారు. సచివాలయం, పంచాయతీ కార్యదర్శులు కూడా తమను పట్టించుకోవడంలేదని, ఈ పనినే నమ్ముకుని బతుకుతున్న తమకు వేతనాలు లేక జీవనాధారం దుర్భరంగా మారిందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

## వెలుగు ఏపీఎంగా మునెయ్య

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 1: మండల వెలుగు ఏపీఎంగా మునెయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఏపీఎం ఇందిరగాంధీ తొట్టంబేడు మండలానికి బదిలీపై వెళ్లారు. శ్రీకాళహస్తిలో పని చేస్తున్న మునెయ్య బదిలీపై ఇక్కడికి వచ్చారు.

## టీడీపీ సీనియర్ నేతకు పరామర్శ



ఏర్పేడు, అక్టోబరు1: టీడీపీ సీనియర్ నేత యూనిట్ ఇన్‌ఛార్జి చంద్రశేఖర్‌నాయుడు రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనంలో వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం సోమవారం తన స్వగ్రామమైన అముదూరులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. మంగళవారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి, మండల అధ్యక్షుడు పొన్నారావు, నేతలు కృష్ణవేణి, గుణయాదవ్ పరామర్శించారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్‌కు ఘనస్వాగతం



స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

రేణిగుంట, అక్టోబరు 1: ఉప ముఖ్య మంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు తిరుపతి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో 3.35గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన అలిపిరికి బయలుదేరి వెళ్లారు. అయితే వాస్తవంగా సాయంత్రం 4గంటలకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తిరుపతి విమానాశ్రయం చేరుకోవాల్సి ఉండగా అరగంట ముందుగా చేరుకున్నారు. శ్రీవారి లడ్డూ విషయంలో సుప్రీంకోర్టు సూచనలు మేరకు ఆయనకు స్వాగతం పలికేందుకు జనసేన నాయకులను ఎవరిని విమానాశ్రయానికి రావద్దని తెలిపినట్లు సమాచారం.

## శరన్నవరాత్రి మహోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, అక్టోబరు 1: శ్రీకాళహస్తీశ్వరాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆవిష్కరించారు. ఆలయ అధికారులు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు లోకేష్‌రెడ్డి, హేమమాలిని, రవి, ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.